క్లుప్తంగా

రేపు డయల్ యువర్ డీఎం

పీలేరు రూరల్ : ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలపై సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం బి. నిర్మల తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సోమవారం డీఎం కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పీలేరు డిపో పరిధిలోని ప్రయాణికులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్లు

మదనపల్లె రూరల్ : విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా ఆదివారం మదనపల్లె ఆపరేషన్ డివిజన్‌లోని అన్ని కలెక్షన్ కౌంటర్లు తెరచి ఉంటాయని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యం.గంగాధరం తెలిపారు. శనివారం ఏపీఎస్పీడీసీఎల్, మదనపల్లె డివిజన్ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో...వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెండింగ్ విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు.

అతిసారాపై ప్రజలకు అవగాహన

రామసముద్రం: మండలంలోని కుదురుచీమనపల్లె పంచాయతీ వై.కురప్పల్లె గ్రామంలో అతిసారా నివారణ చర్యలపై సిహెచ్‌వో జయరాం శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓఆర్ఎస్ ద్రవాణాన్ని తయారు చేయువిధానం, వాటి ఉపయోగాలు, చేతులు పరిశుభ్రం చేసుకునే విధానాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం సుగుణమ్మ, ఆశా కార్యకర్తలు మంజుల, రాధమ్మ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

పీలేరు : దళితులపై దాడికి పాల్పడి 9 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. వివరాలిలా వున్నాయి. మండలంలోని జాండ్ల పంచాయతీ ఆవులయ్యగారిపల్లెకు చెందిన శ్రీరాములు కర్మక్రియల కార్యక్రమానికి దళితులైన నాగరాజు, అరుణకుమారి హాజరయ్యారు. ఆ గ్రామానికి భానుప్రకాష్, హేమంత్‌తో గొడవపడ్డారు. రెండు వర్గాలు ఘర్షణ పడుతున్న సమయంలో అదే గ్రామానికి అగ్రవర్ణస్థులు గంగాధర్‌నాయుడు, మధునాయుడు, బాలాజినాయుడు, ఆవుల వెంకటరమణనాయుడు, సత్యంనాయుడు, విశ్వనాథనాయుడు, వెంకటరమణనాయుడు, మురళీనాయుడు, రామేశ్వర్‌నాయుడు దళితులపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

హార్సిలీహిల్స్ పతంజలికి ఇస్తే ఉద్యమం

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌ను యోగా గురువు రాందేవ్ బాబాకు అప్పగిస్తే ఉద్యమాలు చేపడ్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు, మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాహెబ్ హెచ్చరించారు. శనివారం నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డితో కలిసి హార్సిలీహిల్స్‌పై పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాందేవ్ బాబాకు హర్సిలీహిల్స్ అప్పగిస్తే రేవ్ పార్టీలకు ప్రసిద్ధిగా మారిపోతుందని విమర్శించారు. పేదలు సేదతీరుతున్న కొండపై సామాన్యులకు భారమయ్యేలా చేయొద్దంటూ ప్రభుత్వాన్ని కోరారు.

52 మంది కార్మికుల విచారణ పూర్తి

మదనపల్లె: మున్సిపాలిటిలో దినసరి పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారి నుంచి డబ్బు వసూళ్లు చేశారని కొందరు కార్మిక సంఘ నాయకులపై వచ్చిన ఆరోపణలపై విచారణ ముగింపునకు వస్తోంది. ఇద్దరు కార్మికులు తమ నుంచి నాయకులు డబ్బు తీసుకుని ఆప్కాస్ పరిధిలోకి వచ్చేలా చేసి ప్రభుత్వ సౌకర్యాలు కలిగేలా చేస్తామని నమ్మించారని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టగా మొత్తం 80 మంది దినసరి కార్మికుల్లో 52 మందితో విచారణ పూర్తి చేశారు. ఈ విచారణలో 9 మంది మాత్రమే తమ నుంచి డబ్బు వసూలు చేశారని చెప్పగా ఆ వసూలు చేసిన సొమ్ములో ఒక్కొక్కరి నుంచి ఎంత వసూలూ చేశారనే దానిపై డబ్బు చెల్లించామంటున్న కార్మికుల వాంగ్మూలాలను నమోదు చేశారు. తొమ్మిది మంది తమనుంచి రూ.5.50 లక్షల వరకు తీసుకున్నట్లు వారి విచారణ అధికారి ఎదుట హాజరై వెల్లడించినట్లు తెలిసింది. మిగతా కార్మికుల విచారణ పూర్తయ్యాక మొత్తం ఎంత అన్నది తేలనుంది. తదుపరి అధికారులు ఎలాంటి చర్యలు చేస్తారో చూడాలి.

30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మదనపల్లె: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 30 నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ వి.మనూజరెడ్డి శనివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశానికి కౌన్సిలర్లు హాజరుకావాలని కోరారు. సమావేశంలో అంజెడాకు సంబంధించిన 12 అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇందులో అభివృద్ధి పనులు చేపట్టేందుకు, గుత్తల వేలం, ఇతరా అంశాలు ఉన్నాయని తెలిపారు.

మామిడి రైతును ఆదుకొనేవారేరీ?

- ధరలు లేక ఓవైపు.. చీడపీడలతో మరోవైపు పంట నష్టం
- పంటలబీమా వైపు రైతుల చూపు


పక్వానికి వచ్చి తోటల్లో రాలిపోయిన మామిడి కాయలు

గుర్రంకొండ: నియోజకవర్గంలో నష్టాలపాలవుతున్న మామిడి రైతులను ఆదుకొనేవారు ఏరని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఓవైపు మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతుండగా మరోవైపు మామిడి కాయలకు చీడపీడలు ఆవహించి మరోవైపు రైతులు భారీగా నష్టపోతున్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా రూ.18 కోట్ల మేరకు మామిడి రైతులు నష్టపోయారు. కనీసం గతంలో దరఖాస్తు చేసుకొన్న పంటల బీమా అయినా మాకు వర్తించేనా అని మామిడి రైతులు ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలా పరిధిలోని మామిడితోటల విస్తీర్ణం 8450 కాగా రైతుల సంఖ్య 8484, పంటబీమా చేసుకొన్న రైతులు 745 మంది ఉన్నారు.

గిట్టుబాటు ధర ఏదీ?

ఎన్నడూ లేని విధంగా మార్కెట్లో మామి డికాయలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బంది పడిన దాఖలాలు లేవు. ఈ ఏడాది గత నెల రోజులుగా మార్కెట్లో మామిడి ధరలు రోజు రోజుకు పతనమవుతున్నాయి. సీజన్ ప్రారంభంలో ధరలు కొంత మేరకు ఆశాజనకంగా ఉన్నా ప్రస్తుతం పతనమవుతున్నాయి. బెంగళూరుతో పాటు ఇతర రకాల మామిడికాయల్ని మార్కెట్లో కొనేవారు లేక అక్కడే వదిలేసి వచ్చేస్తున్నారు. మిగిలిన రకాలు రూ. 15 నంచి రూ.22 లోపే ధర పలుకుతుండడతో రైతులు భారీగా నష్టపోతున్నారు. కాయలు కోసి మార్కెట్‌కు తరలించినా గిట్టుబాటు కాక పోవడంతో పలువురు కాయలు కోయకుండా తోటల్లోనే వదిలేస్తున్నారు. దీంతో మామిడిరైతులు ఈ ఏడాది రూ. 18 కోట్ల మేరకు నష్టపోయారు.

చీడపీడలతో పంటనష్టం

మూలిగే నక్కపై తాటికాయపడినట్లు అన్న చందనంగా మామిడి రైతుల పరిస్థితి మారింది. ఓవైపు మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతుంటే మరోవైపు చీడపీడలు బారిన పడి మామిడి తోటలు భారీగా దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా మామిడికాయలు మంచి రంగుమీదకొచ్చి అన్ని తోటల్లో కోతలకు వచ్చాయి. ఈనేపథ్యంలో గత నెలరోజులుగా వాతావారణంలో వస్తున్న మార్పులు, అడపదడపా కురుస్తున్న వర్షాలతో వైరస్‌లు, ఊజీ, నల్లమచ్చలతో పాటు ఇతర చీడపీడలతో మామిడితోటలు భారీగా దెబ్బతింటున్నారు. పక్వానికి వచ్చిన కాయలకు రంధ్రాలు ఏర్పడి కాయలు లోపల కుళ్లిపోతున్నాయి. చెట్టుపైనే కాయలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. తోటల్లో పక్వానికి వచ్చిన కాయలు ఎక్కడ పడితే అక్కడ రాలి రాసులుగా పడిపోతున్నాయి. దీంతో పలువురు వ్యాపారులు కాయలు కోయకుండా తోటల్లోనే వదిలేస్తున్నారు.

తొలిసారి పంటల బీమాపై ఆశ

మామిడిరైతులు తొలిసారిగా పంటల బీమాపై ఆశలు పెట్టుకొన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం కొత్తగా మామిడి పంటకు బీమా సౌకర్యం కల్పించింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఒక్కో ఎకరానికి రైతు రూ. 2250 పంటల బీమా మొత్తాన్ని చెల్లించేలా కొత్త పథకం ప్రారంభించారు. ఈ బీమా సొమ్ము చెల్లించిన రైతులు అకాల వర్షాలకు పంట దెబ్బతిన్నా, వాతావారణ మార్పుల కారణంగా పంటలు దెబ్బతిన్నా పంటల బీమా వర్తిస్తుందని అప్పట్లో అధికారులు ప్రకటించారు. దీంతో పలువురు మామిడి రైతులు తొలిసారిగా 745 మంది 985 ఎకరాలకుగానూ రూ. 22,16,250 మొత్తాన్ని పంటల బీమా కింద చెల్లించారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో పంటలు దెబ్బతినడంతో తొలిసారిగా పంటల బీమాపైన ఆశలు పెట్టుకొన్నారు.

కాయలు కుళ్లిపోతున్నాయి



ఎన్నడూ లేని విధంగా తోటల్లోనే మామిడి కాయలు కుళ్లిపోతున్నాయి. కాయల్లో పురుగులు పడి చెట్లపైనే కుళ్లిపోయి రాలిపోతున్నాయి. తీరా పంట కోతకొచ్చిన సమయంలో ఇలా జరగడంతో కాయలు కోయకుండా అలాగే వదిలేశాం. ఇలాంటి కాయలు కోసినా మార్కెట్‌లో కొనేవారు ఉండరు.

- రాజగోపాల్, గుట్టకిందపల్లె

ఆశించిన ధరలు లేవు



ఈ సంవత్సరం ఆశించిన విధంగా మార్కెట్లో మామిడికి గిట్టుబాటు ధరలు లభించడం లేదు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడ లేదు. నెలరోజులుగా మార్కెట్లో ధరలు పడిపోయాయి. కొన్ని రకాల కాయలు మార్కెట్లో కొనేవారు కనిపించడం లేదు. ఎంతో ఆశతో మార్కెట్‌కు తీసుకెళ్లి అక్కడే వదిలేసివచ్చేశాం.

- సావిత్రమ్మ, చారావాండ్లపల్లె

చిన్నారి ఆరోగ్యం.. దేశానికి సౌభాగ్యం


మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ శ్రీగిరీష

పీలేరు : చిన్నారి ఆరోగ్యం దేశానికి సౌభాగ్యమని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీగిరీష అన్నారు. రాష్ట్రీయ బాల ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా శనివారం తలపుల పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టుక నుంచి ఆరు సంవత్సరాల చిన్నారుల వరకు పుట్టుకతో వచ్చే ఆరోగ్య లోపాలు, వ్యాధులను ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సందర్శనతో గుర్తించాలన్నారు. ఏవైనా లోపాలు, వ్యాధులు ఉంటే మెరుగైన సూచనలు, సలహాలు, చికిత్సకై ఉన్నత ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. ఆరోగ్య సమస్యలు లేని చిన్నారుల లోకాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తలపుల పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పున:ప్రతిష్ట మండలం పూజ


మండలం పూజ నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో అమ్మవారి పున:ప్రతిష్ట మండలం పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన అమ్మవారి ఆలయంలో విగ్రహ పున:ప్రతిష్ట కావించి 40 రోజులు గడిచిన సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. పురోహితులు శివరామకృష్ణ శర్మ , ఆలయఅర్చకుల ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు ఆలయంలో గణపతిపూజ స్వస్తి పుణ్యాహవాచనం కావించారు. కలశ ఆరాధన, నవగ్రహ పూజలు చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి సహస్ర నామావళితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణపతి హోమం, మహాపూర్ణాహుతి హోమాలు చేశారు. ఆలయంలో దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండలం పూజ ఉభయదారులు వీరాంజినేయ ప్రసాద్, ఆలయ ఈఓ మంజుల, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


వాహనదారులకు సూచనలిస్తున్న సీఐ యుగంధర్

పీలేరు రూరల్ : నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సీఐ యుగంధర్ అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో, క్రాస్ రోడ్డు, చిత్తూరు రోడ్డు, కడప రోడ్డులో ట్రాఫిక్‌పై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఆర్‌వోబీ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. వాహన చోదకులు ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపరాదన్నారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న తహశీల్దార్ నరేంద్రకుమార్

కేవీపల్లె : మండలంలో ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ నరేంద్రకుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ మండలంలో గిరిజనుల భూసమస్యలు అధికారులు దృష్టికి తెచ్చినా ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. స్వయం సహాయక సంఘాల్లో దళితులకు ప్రాధాన్యత ఇచ్చి రుణాలు ఇవ్వాలన్నారు. మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా నిరుద్యోగ దళిత యువతీయువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో దళితులకు రాజకీయాలతో సంబంధం లేకుండా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రిజర్వ్‌బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా స్టాండ్ ఆఫ్ ఇండియా, ముద్ర రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ రాయితీతో ఇచ్చే వ్యవసాయ పనిముట్లు పారదర్శకంగా అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, ఎంపీడీవో సుధాకర్, ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప, జిల్లా మానటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, వివిధ దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం.. తల్లిలేకుంటే ఇవ్వరా?


ఇద్దరు కుమార్తెలతో పాఠశాల వద్ద బాధితుడు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మద్దయ్యగారి పల్లి పంచాయతీ పులగంటివారిపల్లికి చెందిన జక్కల వెంకటేష్, జక్కల లక్ష్మి దంపతులు. వీరికి లాస్య (10). వర్ష (9) కుమార్తెలతో పాటు రేవన్ (6) అనే బాలుడు సంతానం. వ్యవసాయ పనులే వీరి జీవనాధారం. అయితే భార్య లక్ష్మి అనారోగ్యంతో ఐదేళ్ళ క్రితం మృతి చెందింది. ప్రస్తుతం కుమార్తెలిద్దరూ స్థానికంగానే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో 4, 5వ తరగతులు చదువుతున్నారు. భార్య మృతి చెందినా కూడా గత వైఎస్సార్‌సీపీ పాలనలో మూడు సార్లు తన పేరిట అమ్మ ఒడి మంజూరైందని వెంకటేష్ తెలిపాడు. కూటమి పాలనలో తన ఇద్దరు కుమార్తెల్లో ఒకరి పేరిట కూడా తల్లికి వందనం డబ్బులు పడలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. డబ్బులు ఎందుకు పడలేదని సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తే సరైన ఆదాయ ధ్రువీకరణ లేదని ఆన్‌లైన్‌లో డిస్‌ప్లే అవుతోందని, మళ్ళీ రీవెరిఫికేషన్ చేసి ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు సమాధానమిచ్చారని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వ పాఠశాలలోని యూ డైస్ రికార్డులను పరిశీలిస్తే బాలికల వివరాలు ఆరంభం నుంచి ఒకే విధంగానే ఉన్నాయని టీచర్లు చెబుతున్నారు. తల్లికి వందనం పథకానికి అన్ని అర్హతలు ఉన్నా మాలాంటి పేదలకు పథకం డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని బాధితుడు వాపోతున్నాడు. అధికారులు స్పందించి తన ఇద్దరు కుమార్తెల పేరిట పథకం డబ్బులు మంజూరయ్యేలా చూడాలని విన్నవిస్తున్నాడు.

సేవాభావంతో పని చేయాలి

మదనపల్లె సిటీ: ఉద్యోగులకు బదిలీలు సహజమని, సేవాభావంతో పని చేయాలని డిప్యూటీ ఈఓ లోకేశ్వరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిన భాస్కరన్, రబియాబేగం, శైలజ,భాగ్యలక్ష్మి, నరసింహప్రసాద్, పద్మావతిలను సన్మానించారు. పాఠశాలలో అంకితభావంతో పనిచేశారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల మన్ననలు పొందాలి


బహుమతి అందజేస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు.శనివారం స్థానిక డిపో గ్యారేజీలో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈపీకె,ఓఆర్, కెఎంపిఎల్‌లో రీజియన్‌లో డిపో మొదటి స్థానం నిలిచిందన్నారు.అందరూ కృషి,సహకారంతో మొదటి స్థానం వచ్చిందన్నారు. ఆదాయం పెంచి డిపో అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మే నెలలో రఫీ డ్రైవర్ 110 లీటర్లు డీజిల్ పొదుపు చేసి నందుకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల మంజూరులో అక్రమాలు

మదనపల్లె: మున్సిపాలిటి పరిధిలో వివిధ కులాల కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాల మంజూరు ప్రక్రియలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని బహుజన యువసేన అధ్యక్షులు పునిత్ కుమార్ శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నేతలు సిఫార్సు చేసిన వారికే రుణాలు మంజూరు చేస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న సామాన్యులకు కష్టమే మిగులుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మెప్మా అధికారులు అధికార పార్టీ నేతల సిఫార్సు మేరకు వారిచ్చిన జాబితాలోని వారికి రుణాలు ఇచ్చేలా జాబితాలు తయారు చేశారని అన్నారు. రుణాల మంజూరులో అర్హులైన పేద అభ్యర్థులకు అన్యాయం జరిగితే న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో హరికృష్ణ, జిలానిబాషా, పూర్ణచంద్ర, వినయ్, శశికుమార్,నిజాం, బాలకృష్ణ, రమేష్, సాయికిరణ్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు నాలుగు ఫిర్యాదులు

మదనపల్లె సిటీ: మదనపల్లె-2 డిపో పరిధిలో శనివారం నిర్వహించిన కాల్ యువర్ డీఎం కార్యక్రమానికి నాలుగు ఫిర్యాదులు అందాయి. రామసముద్రం మండలం ఎలవానెల్లూరుకు పాఠశాల విద్యార్థులు అనుకూలంగా బస్సు నడపాలని, మదనపల్లె- రామసముద్రం చివరి బస్సు రాత్రి 9.30 గంటలకు నడపాలని, దొడ్డిపల్లి-పుంగనూరుకు ఉదయం, సాయంత్రం బస్సు నడపాలని స్థానికులు ఫిర్యాదులు చేశారు. వాల్మీకిపురం వయా తరిగొండ మీదుగా గుర్రంకొండ సర్వీసులు యథావిధిగా నడపాలని కోరారు. కార్యక్రమంలో డీఎం అమర్‌నాథ్, సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణతోనే జీవాల ఎదుగుదల

తంబళ్లపల్లె: జీవాల కాపరులు ముందుస్తు జాగ్రత్తల్లో భాగంగా నట్టల నివారణ చర్యలు తీసుకున్నప్పుడే వాటి ఎదుగుదల ఉంటుందని మండల పశు వైద్యాధికారి డాక్టర్ విక్రమ్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలో పశుసంవర్థకశాఖ ఏడీ సుమిత్ర ఆధ్వర్యంలో నట్టల నివారణ కార్యక్రమాన్ని కన్నెమడుగులో ప్రారంభించారు. 450 గొర్రెలు, 34 మేకలకు నట్టల నివారణ మందు తాపారు. మందు తాపడం వల్ల జీవాల్లో నట్టలు(నులిపురుగులు) నివారించబడి జీవాలు ఆరోగ్యంగా ఎదుగుదల ఉంటుందన్నారు. కార్యక్రమం జూలై 10వతేదీ వరకు కొనసాగుతుందన్నారు. మండలంలో 85 వేల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపనున్నట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రమేష్, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో స్వామివార్లకు వేకువజామునే పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంత సేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహ స్వామి ఆలయంలో వేకువజామేన అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లను సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

-డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు


సూచనలు ఇస్తున్న డీసీహెచ్ఎస్ ఆంజనేయులు

తంబళ్లపల్లె: గ్రామీణ ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు కోరారు. శనివారం స్థానిక సీహెచ్‌సి సందర్శించారు. ఆస్పత్రిలోని ల్యాబ్, ఎక్స్‌రే, దంత వైద్య విభాగం, మెటర్నటీ, స్కానింగ్ సెంటర్, ఆపరేషన్ థియేటర్, ఓపి, వార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్లు అందుబాటులో ఉండి అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్వికి సూచించారు. విధి నిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఆయన వెంట డాక్టర్లు విక్రాంత్‌రెడ్డి, మహేష్‌రాజు, హెడ్ నర్సు గ్లోరీ లిటిల్ ఫ్లవర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.